
# నాలాగా ఎందరో



*తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) రాజలక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో (1996) బహుమతి పొందిన కథ*

లక్ష్మీరంగనాథన్

వంట ఇంట్లో పాలు కాస్తున్న నాకు పక్క వాటాలో కేకలు వినబడ్డాయి.

'వెధవా! ఎన్ని సార్లు చెప్పాలిరా, చదువూ, చదువూ అంటే వినవు. మార్కులు చూడు ఎలా వచ్చాయో! ఇలా చదివే కంటే చస్తే నయం. మా పరువు తీయడానికే పుట్టావు!' ధబదబా బాదిన శబ్దం.

నాకయితే ఒళ్ళు మండిపోయింది. ఆ దెబ్బలు నా వీపు మీద పడ్డట్లే ఫీల్ అయ్యాను. రోజూ ఇదే వరస. ఎందుకలా ఆ బాబుని చావబాదుతున్నారో అర్థం కావడం లేదు. ఆవిడ తల్లా! రాక్షసా! వుండబట్టలేక స్టౌ ఆపేసి హాలులో పేపరు చదువుతున్న ఆయనతో చెప్పాను.

'పాపం! ఆ బాబుని వాళ్ళు కొడుతున్నారండి' జాలిగా చూశాను.

'ఏం చేయమంటావు. వాళ్ళ అబ్బాయి వాళ్ళ ఇష్టం. వాళ్ళ విషయంలో ఈ ఫ్లాట్స్‌లో ఎవరూ జోక్యం చేసుకోనవసరం లేదు. మనకెందుకొచ్చిన తలకాయ నొప్పి' అన్నారు ఆయన తీసిపారేస్తూ.

'ఏమోనండీ! ఆ బాబుని తలుచుకుంటే జాలిగా వుందండి. రోజూ దెబ్బలు తిని తిని, పిచ్చివాడై పోతాడేమోనండి'

'నీకు ఎవరిని చూసినా పాపమే. రోడ్డుమీద కాకి పిల్ల చనిపోతేనే పాపం! పాపం! అంటూ ఆ రోజంతా ఫీల్ అవుతావు. నువ్వు మరీ సెన్సిటివ్. పిల్లల్ని కొట్టడం, తిట్టడం నీకు నచ్చదు. అందరూ నీలా వుంటారా!'

'ఆవిడని నిలదీసి నాలుగు మాటలు అడుగుదామని వుంది పిల్లల్ని పెంచడం చేతకాకపోతే కనడం ఎందుకు?'

'అమ్మా పక్క యింటి విషయాలు మనకెందుకు. వాళ్ళ ఇష్టం. అనవసరంగా ఆ అబ్బాయిని గురించి నువ్వు టెన్షన్ అవకు. నీతో రోజూ ఇదే పోరా!' విసుక్కున్నాడు కొడుకు మురళి.

తప్పదన్నట్టు నోరుమూసుకుని మౌనంగా ఆలోచిస్తూ కూర్చున్నాను.

ఆ రోజంతా నామనసు నిండా బాబు గురించి ఆలోచనలే. పక్కింటి అబ్బాయి, బాబు, మురళీ ఒకే స్కూలులో టెన్త్ చదువుతున్నారు. యావరేజ్‌గా చదివే ఆ బాబుని పట్టుకుని మాటికి మారు రావాలి అన్నట్టు ప్రాణం తీస్తున్నారు బాబు అమ్మానాన్న. ఒక్క నిమిషం తీరిక లేకుండా, ట్యూషన్స్‌కి పంపుతున్నారు వాడిని. పిలిచినా తనవాటాలోకి రాడు. వాళ్ళ అమ్మ కండిషన్ కాబోలు. ఒక్కసారి ఆ బాబుని ఒంటరిగా వదిలి బయట తాళం పెట్టుకుని, చిన్నకూతుర్ని మాత్రం వెంటేసుకుని వెళ్తారు భార్యాభర్తలిద్దరు. మనసెలా ఒప్పుతుందో. ఒంటరిగా ఆ బాబు ఎలా వుంటాడో! ఇంత రూడ్‌గా కూడా వుంటారా తల్లిదండ్రులు. నమ్మశక్యం కాలేదు. అందర్నీ నాలా అంచనా వేసుకోవడం వల్లనే ఇలా అనిపిస్తుంది కాబోలు. ఆ అబ్బాయికి తల్లిదండ్రుల మీద ప్రేమ ఎలా వుంటుంది. పిల్లల లేతమనసుల్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నించరు కొంతమంది తల్లిదండ్రులు! ఒక్కసారి ఆవిడ తిట్టేటపుడు, ఆవిడ తల్లా! రాక్షసా అనిపిస్తుంది. ఎలాగయినా కొడుకుని ఇంజనీరో, డాక్టరో చేయాలన్నది వాళ్ళ తాపత్రయం. ఆశ పడడంలో తప్పలేదు. దానికంటూ కొంచెం మయినా అర్హతలుండాలిగా. సొసైటీలో గొప్ప కోసం, పిల్లల్ని టార్క్స్ చేయరాదు. మన పిల్లల తెలివితేటల్ని అంచనా వేసి దానికి తగ్గట్టు వాళ్ళని మలచాలే గానీ గొప్పలు కోసం బాగాలేదు. యీ బాబుని చదువూ! చదువూ! అంటూ బాదితే, వాడికి చివరికి చదువంటేనే విరక్తి కలుగుతుంది. మనమే వాళ్ళను పాడు చేసేది. నేను నా పిల్లల్ని ఎవరిలోనూ కంపేర్ చేయను.

పిల్లల్ని కళ్ళతో ఖండించాలి కానీ, కొట్టడం ద్వారానో, పనిష్మెంట్స్ ఇవ్వడం ద్వారానో వాళ్ళని మార్చలేము. మురళి ఏ తప్పుచేసినా, నా దగ్గర వాళ్ళనాన్నదగ్గర చెప్తే సారీ అంటాడు.

ఓ సారి స్కూలులో ఆ అబ్బాయిని కలిసి మాట్లాడాను. ఆంటీ! రోజూ చూస్తున్నారుగా, దెబ్బలు తినితిని ఒళ్ళు మొద్దుబారిపోయింది. ఆ ప్రోగ్రెస్ కార్డుల్లో సంతకం తీసుకునే సరికి ఒళ్ళు హూనం అయ్యింది. చదవలేక పోతున్నాను అంటే నాకున్న బ్రెయిన్ యింతే. వాళ్ళలాగా చదవాలి, వీళ్ళలాగా చదవాలి అంటారు. అదెలా సాధ్యం ఆంటీ. వెధవది ఓ సండేరోజు కూడా టీవీ చూడనివ్వరు సరి కదా! టీవీ తీసి నన్ను నా గదిలో చదవమంటారు. వాళ్ళంతా హాలులో చెల్లాయిని కూర్చోబెట్టుకుని ఎంజాయ్ చేస్తారు. నాకు ఎంజాయ్ చేయాలని వుండదా ఆంటీ! ఏమన్నా అంటే టెన్త్ పబ్లిక్, నీలాటి వాళ్ళు ఇరవైనాలుగు గంటలూ చదివితే గానీ మార్కులు తెచ్చుకోలేరుఅంటుంది అమ్మ. అదెలా సాధ్యం ఆంటీ, చదివినా మరిచిపోతున్నాను ఆంటీ. నా మనసు చదువు మీద లగ్నం కావడం లేదు. ఎక్కడికైనా తీసుకువెళ్తారా చూస్తూనే వున్నారుగా నన్ను లోపల పెట్టి తాళం వేసుకు వెళతారు. ఒంటరిగా టీవీ చూస్తానేమోనని కనెక్షన్ లాగేసి వెళతారు. ఈ జైలు జీవితం నుంచి బయటికి పారిపోవాలని వుంది. నిజంగా చచ్చిపోవాలని వుంది ఆంటీ' కళ్ళలో నీళ్ళు తిరిగాయి బాబుకి.

అది చూసిన నాకు కన్నీళ్ళు వచ్చాయి. అపుడపుడు ఆ బాబుని ఓదారుస్తూ వుండేదాన్ని. అది తెలిసినా వాళ్ళ అమ్మ ఊరుకోదు. ఎవరితోనూ మాట్లాడదు సరికదా, పిల్లల్ని చేరనివ్వదు. చేరితే చెడిపోతారన్నది ఆవిడగారి నమ్మకం. ఈ శతాబ్దంలోనూ యిలాంటి వాళ్ళు వున్నారా? ఆ బాబుని వాళ్ళే చెడగొడుతున్నారు చూడబోతే బాబు చాలా మంచి పిల్లవాడు. ఇద్దరూ చదువుకున్న వారు, ఉద్యోగస్తులు. కానీ ఏం లాభం. మెచ్యూరిటీ లేదు. ఎదురించి వాసుతో కంపేర్ చేస్తారు వాళ్ళ బాబుని. లెక్కల్లో వందమార్కులు వచ్చాయట వాసుకి. నీ కెందుకు రాలేదు అని దెబ్బలు. అందరి తెలివితేటలు ఒకలా వుంటాయా? వాసు అమ్మ డాక్టర్, బాబే తిరిగి 'వాళ్ళ అమ్మ నీవు డాక్టరువా? అడిగితే ఈ

కాలం పిల్లలు అడిగినా అడుగుతారు. మన మర్యాద మనం కాపాడుకోవాలి. దెబ్బలి కొట్టినంత మాత్రాన నందమార్కులు వస్తాయా! పిచ్చికాకపోతే నా మనసులోని భావాల్ని ఆవిడ ముందు వుంచాలని వుంది. కానీ ఏం లాభం. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టే, మాట వరసకి ఏదైనా అంటేనే, నా కుటుంబ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి మీరెవ్వరు. మొఖం మీద కొట్టినట్టే అంటుంది. ఎలా రాను మార్కులు, టీవీ, సినిమాలు, పాటలు, డైలాగ్స్ గుర్తుండడం లేదు. చదివితే వస్తాయి. పట్టుదల వుండాలి. రోషం వుండాలి. అంటుంది ఆవిడ. 'నిజమే, వాటికోసం నువ్వెంత సహకరిస్తున్నావు మీ అబ్బాయితో' జవాబు శూన్యమే. యినన్నీ విని విని విసుగెత్తిపోయింది నాకసలు. పాపం! బాబు, జాలి పడడం తప్ప ఏం చేయగలను నేను. గాజు సామాను హేండిల్ చేసినట్టు పిల్లల్ని హేండిల్‌చేయాలి. చేయి జారితే అంతే సంగతులు. బాధపడి ప్రయోజనంలేదు. బయట కాలింగ్ బెల్ శబ్దం చెవిన పడడంతో, ఆలోచనల్ని పక్కకి నెట్టి నా ప్రపంచంలోకి వచ్చాను.

పరీక్షలు దగ్గరయ్యే కొద్దీ నాకు టెన్షన్ ఎక్కువయింది. నా బాబు గురించి కాదు. పక్కింటి బాబు గురించి. మురళీ గురించి నాకు బెంగ లేదు. వాడు హార్డ్‌వర్క్ చేస్తున్నాడు. అంత కంటే వాడిని కష్టపెడితే పాపం! కృషికి తగిన ఫలితం లభిస్తే చాలు. ఆ బాబుకి మూడుపూట్లాతిట్లు, దెబ్బలు, కోటా పెరిగినట్టుంది.

వాడికోసం దేవుడిని మొక్కుకున్నాను. నన్ను చూసి మా వాళ్ళు ఎగతాళి చేయసాగారు. చేస్తే చేయనీ. అనుకున్నాను.

పరీక్ష హాల్లో బాబు మనసు పేపరు మీద లగ్నం కావడంలేదు. రాయలేక పోతున్నాడు. వాడి మనసు నిండా అమ్మానాన్న తిట్లు నిండి వున్నాయి. రాస్తూనే వున్నాడు కానీ బాబు మెదడులో ఆలోచనలు, ఫ్రెన్‌ కంటే స్పీడుగా వెంటాడుతున్నాయి. దినదినగండం దీర్ఘాయుష్షులా పరీక్షలు వ్రాసి నిట్టూర్చాడు బాబు.

కానీ మనసులో ఒకటే భయం. అమ్మానాన్న ఎదురుచూసే మార్కులు రాకపోతే ఇంతే సంగతులు. పాస్ అవడం ఖాయం. రిజల్ట్స్‌టైముకి ఇంట్లో సీను ఎలా వుంటుందో, ఊహించలేక పోయాడు బాబు. సమ్మర్ కోచింగ్ క్లాసులో చేర్పించారు. అయిష్టంగా వెళ్ళసాగాడు. సెలవుల్లో కూడా క్రికెట్ ఆడనివ్వడం లేదు. తన ఫ్రెండ్స్ అంతా గ్రౌండులో ఆడుకుంటున్నారు. 'సన్‌స్ట్రోక్' వస్తుందని బయటికి వెళ్ళరాదట. ఈ 'స్ట్రోక్' కంటే అదే నయం, తిట్టుకున్నాడు మనసులో.

నేను నా పిల్లల్తో ఊరికి వెళ్ళి వచ్చాను. బాబును చూడగానే తేలిక పడింది. ఊర్లో కూడా వాడి గురించే మాట్లాడేదాన్ని. క్లాసెస్‌కి వెళుతున్నాడని తెలిసి సంతోషపడ్డాను. యింట్లో వుండి తిట్లు తినేకన్నా బయటకు వెళ్ళడమే నయం అనుకున్నాను. రోజూ అయిదుగంటల కల్లా వచ్చే బాబు ఆ దినం ఏడుగంటలయినా రాలేదు. వాళ్ళ అమ్మానాన్నా ఆరోజున లేటుగా వచ్చారు ఆఫీసునుంచి. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియలేదు. ఉదయం లేవగానే బాబు వచ్చాడా! అని అడుగుదామని బయటకు వచ్చాను. ఇంటి గుమ్మం ముందున్న ఓ కవరు కంటబడింది. తీసి చూశాను. దానిమీద 'ఆంటీ' అని రాసి వుంది. చింపి చదవసాగాను.

ఆంటీ!

మీతో మనసు విప్పి మాట్లాడాలని వుంది. మా అమ్మానాన్నని చూస్తే నాకు భయం తప్ప ఎలాంటి ఫీలింగ్స్‌రావడం లేదు. నేను పాసవుతాను తప్ప మంచి మార్కులు తెచ్చుకోలేను. రిజల్ట్స్ వచ్చాక నా ప్రాణం తీసేస్తారు వాళ్ళు. నాకింటికి రావడం ఇష్టం లేదు. అమ్మానాన్నకి వ్రాసే ధైర్యంలేదు, ఇష్టం లేదు. నన్ను చచ్చిపో చచ్చిపో అని తిట్టే అమ్మకి నా గురించి బెంగ లేదు. నాకు చచ్చి పోవాలనుంది కాని మీ మాట మీద గౌరవం వుంది నాకు. చచ్చి సాధించేదేమీలేదు. యింట్లో అమ్మ ఫీజుకని ఇచ్చిన వందరూపాయలు తీసుకుని ఊరు వదిలి పారిపోతున్నాను. మీకు తెలియాలని వ్రాశాను. మా అమ్మానాన్నవాళ్ళే తెలుసుకుంటారు. మీకు నా మీద సాఫ్ట్ కార్నర్. అందుకే మీమీద గౌరవం వుంచి, నా నిర్ణయాన్ని మీకు మాత్రం వ్రాశాను. నన్ను క్షమించండి. ఎక్కడున్నా మీ ఆశీర్వాదం నీడలా వుండి కాపాడుతుంది. ఆ నమ్మిక నాకుంది. వుంటాను' 'నాలాగా ఎందరున్నారో ఈ ప్రపంచంలో వారిని కలుసుకోబోతున్న బాబు'.

అది చదివిన నేను నోట మాట రాక స్తంభించి పోయాను.

# జాతక ఫలాలు

**నా** వివాహం ఎప్పుడు? వుద్యోగం వస్తుందా? వ్యాపారం లాభిస్తుందా? కలతలు తీరుతాయా? పరీక్ష పాస్ అవుతామా? కోర్టు తీర్పు అనుకూలిస్తుందా? ఇంకా ఎన్నో ఎన్నెన్నో సమస్యలు... నో ప్రాబ్లమ్... వాటికి పరిష్కారాలను దోషపరిహారణలను **'ఆంధ్రజ్యోతి వీక్లీ'** మీకు అందించనున్నది. **'జాతకంలో దోషాలు'** శీర్షిక ద్వారా ఎన్నో వుపయుక్త విషయాలు చెప్పిన **"జ్యోతిషమణి శ్రీ ఎం.వి.సుబ్బారావు"** మీ ప్రశ్నలకు బదులిస్తారు. మీరు చేయాల్సిందల్లా ఈ క్రింది కూపన్‌లో మీ వివరాలు రాసి మాకు పంపడమే. వొక కూపన్‌పై వొకే ప్రశ్నను పరిశీలిస్తారు.

## జాతక ఫలాలు కూపన్

పేరు:..............................

జన్మతేదీ:..............................

జన్మించిన

స్థలం పేరు:..............................

చిరునామా:..............................

..............................

..............................